నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
8 నిజామాబాద్, సోమవారం 12 మే 2025 NIZAMABAD



## అమరవీరులకు నివాళి

**ఆపరేషన్ సిందూర్‌లో** భాగంగా పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీరమరణం పొందిన భారత సైనికులకు నిజామాబాద్ రూరల్ మండలంలోని ఆకుల కొండూర్ గ్రామంలో వాయుపుత్ర యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘన నివాళులర్పించారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

–సారంగాపూర్, మే 11



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

# ఇందిరమ్మ ఇండ్లు ఎక్కడ?

- ఇప్పటివరకు ఒక్క నిర్మాణం చేపట్టలేదు..
- లబ్ధిదారులను కాంగ్రెస్ నేతలే ఇండ్లలో కూర్చొని ఎంపిక చేస్తున్నరు..
- ఒక్కో ఇంటికి రూ.50 వేలు వసూలు
- గ్రామసభల ద్వారా మాత్రమే అర్హులను ఎంపిక చేయాలి
- ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలి
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఖలీల్‌వాడి, మే 11 : జిల్లాలో ఇప్పటివరకు ఒక్క ఇందిరమ్మ ఇల్లు నిర్మించలేదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రూ.50వేలు తీసుకొని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను కాంగ్రెస్ పార్టీ నేతలు తమ ఇండ్లల్లో కూర్చొని ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. గ్రామసభల ద్వారానే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తానని హామీ ఇస్తే, ప్రజలు నమ్మి ఓటు వేశారని తెలిపారు. అధికారంలోకి వచ్చి 17 నెలలవుతున్నా దసరా, సంక్రాంతి అంటూ మాటలు చెబుతూ వాయిదా వేస్తున్నారని మండిపడ్డారు. నిజామాబాద్ జిల్లాలో లక్షా 80 వేల మంది పేదలు దరఖాస్తు చేసుకోగా.. కాంగ్రెస్ నేతలు ఇండ్లలో కూర్చొని 70 వేల మందిని ఎంపిక చేశారని తెలిపారు. జిల్లాలో 70 వేల మంది అర్హులని చెప్పిన కాంగ్రెస్ నేతలే, ఇప్పుడు 17 వేల మందికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నట్లు ప్రకటించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చిన జీవో 7 ప్రకారం గ్రామసభల ద్వారా అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. గ్రామసభల ద్వారా అంగీకారం తెలిపిన వారికే కలెక్టర్ ఇండ్లను మంజూరుచేయాలని సూచించారు. గ్రామసభల ద్వారానే ఎంపిక చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు ఒక్క గ్రామసభ నిర్వహించలేదని తెలిపారు. కాంగ్రెస్ నేతలు అక్రమంగా ఎంపిక చేసిన ఫైనల్ లిస్టును ఖరారుచేస్తే పేదలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. న్యాయంగా ఇండ్లు రావాల్సిన వారికి గులాబీ కార్యకర్తలు అండగా నిలువాలని, తహసీల్, పంచాయతీ కార్యాలయాల ఎదుట నిరసన చేపట్టాలని పిలుపునిచ్చారు.

**జేబులు నింపుకోవడానికి రాజీవ్ యువ వికాస్**

కాంగ్రెస్ నేతలు జేబులు నింపుకోవడానికి రాజీవ్ యువవికాస్ పథకం ప్రవేశపెట్టారని వేముల విమర్శించారు. డబ్బులు ఇచ్చిన వారికి, కాంగ్రెస్ కార్యకర్తలకే ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారని అన్నారు. పథకం ద్వారా రూ. 6500 కోట్లు నేరుగా కాంగ్రెస్ నేతల జేబులు నింపేందుకు పక్కాప్లాన్ వేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే రాజీవ్ యువ వికాస్ పథకం, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని మినరల్ డెవలప్‌మెంట్ చైర్మన్ ఈరవత్రి అనిల్ బహిరంగంగా చెబుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడిన వీడియోను విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు. ఇందిరమ్మ ఇండ్లకు కేటాయించిన రూ.12వేల కోట్లనుంచి రూ. 6,500 కోట్లు కాంగ్రెస్ కార్యకర్తలకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. ఎవరి సొమ్మని కాంగ్రెస్ పార్టీ నేతలు జేబులో నింపుకొంటున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నిధులు కార్యకర్తలకు ఇచ్చుకుంటే అభ్యంతరం లేదని, తెలంగాణ ప్రజల సొమ్ము పేదలకు చెందాలన్నారు. రాజీవ్ యువవికాస్, ఇందిరమ్మ ఇండ్ల జాబితాలను గ్రామసభల్లోనే ఫైనల్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామసభలు నిర్వహించకుండా రికార్డుల్లో రాసి, కాంగ్రెస్ నేతలు చెప్పిన వారిపేర్లు రాసి కలెక్టర్‌కు పంపితే అధికారులను కోర్టుకు ఈడుస్తామని హెచ్చరించారు.

### మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మందకొడిగా సాగుతున్నదని వేముల తెలిపారు. రైస్‌మిల్లర్లు వెంటనే అన్‌లోడ్ చేయడం లేదని, సన్నపు వడ్లు తీసుకోవడంలేదన్నారు. నిర్దేశిత లక్ష్యం ప్రకారం 10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాల్సి ఉండగా.. ఇప్పటివరకు 7 లక్షల 50 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారని తెలిపారు. ఇంకా లక్షా 50 మెట్రిక్ టన్నుల ధాన్యం కల్లాల్లో ఉందన్నారు. లక్షా 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం లారీల్లో ఉందని తెలిపారు. 17 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తరుగు కింద తీసేసి, రైస్‌మిల్లర్లు దోచుకుంటున్నారని ఆరోపించారు. కలెక్టర్ చొరవ తీసుకుని ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. 45 రోజులైనా కొనుగోళ్లు పూర్తి కావడంలేదన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, 45 రోజులైనా ఇవ్వలేదన్నారు. అన్ని రకాల వడ్లకు రూ. 500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందాల పోటీలపై పదిసార్లు సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి..ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ధాన్యం కొనుగోళ్లపై కూడా సమీక్షించాలని సూచించారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌నాయకులు సత్యప్రకాశ్, సూదం రవిచందర్, నవీద్ ఇక్బాల్, రాజాగౌడ్, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

# సైన్యానికి సలాం



- పాక్ ఉగ్రమూకల వెన్నువిరిచిన కేంద్ర బలగాలు
- పాకిస్థాన్‌పై ప్రతీకార దాడికి వెల్లువెత్తిన మద్దతు
- మళ్లీ యుద్ధమంటే వణుకుపుట్టేలా దెబ్బ తీసిన భారత సైన్యం
- దేశప్రజల్లో ధైర్యం నింపిన 'ఆపరేషన్ సిందూర్'

**భారత సైన్యానికి** ప్రజలు సలాం కొడుతున్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ముష్కర మూకలను తుదముట్టించింది. వ్యూహాత్మకంగా మెరుపు దాడులతో పాకిస్థాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి ఆపరేషన్‌ను విజయవంతం చేసింది. పాక్ దొంగచాటుగా చేస్తున్న దాడులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ ఆ దేశానికి చుక్కలు చూపిస్తుండడంతో భారతావని గర్వపడుతున్నది. భారత సైన్యానికి మద్దతుగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ర్యాలీలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భారతయుద్ధ వీరులకు సంపూర్ణ విజయం కలుగాలని, భారత త్రివిధ దళాలు క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ దేశ ప్రజల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని నింపిందని మన దేశ మాజీ జవాన్లు మన సైన్యాన్ని అభినందిస్తున్నారు. దేశం పిలుపునిస్తే తాముకూడా యుద్ధంలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేస్తున్నారు.



### పాకిస్థాన్ నామరూపాల్లేకుండా పోతుంది..

డిచ్‌పల్లి, మే 11 : ఏడో తరగతి చదువుతున్నప్పటి నుంచే క్రీడల్లో ప్రతిభ కనబర్చడంతో ఆర్మీకి సెలెక్టయ్యాను. 15 ఏండ్లు సైన్యంలో సేవలందించి రిటైర్డ్ అయ్యాను. ఎన్నో ఉద్యోగాలు వచ్చిన కూడా వదులుకుని రైతులకు సేవలందించాలనే ఉద్దేశంతో కో–ఆపరేటివ్ బ్యాంకులో ఉద్యోగం ఎంచుకున్నాను. అప్పుడు దేశానికి, ఇప్పుడు రైతులకు సేవలందించడం చాలా సంతోషాన్ని ఇస్తుంది. 1999 కార్గిల్ యుద్ధంలో పాల్గొని అప్పటి రాష్ట్రపతి ద్వారా మెడల్ అందుకున్నాను. సైన్యంలోనే ఉంటూ క్రీడల్లో కూడా అంతర్జాతీయ స్థాయి వరకు ఆడగలిగాను. సైన్యం నాకు ఎన్నో అనుభవాలు, అనుభూతులను ఇచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో మళ్లీ యుద్ధం జరిగితే నేను పాల్గొనడానికి సిద్ధంగా ఉన్నాను. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రజలెవరూ కూడా భయభ్రాంతులకు గురికావొద్దు. ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన సైన్యం మన వద్ద ఉంది. పూర్తిస్థాయిలో యుద్ధం గనుక జరిగితే పాకిస్థాన్‌ను నామరూపాలు లేకుండా చేస్తుంది మన సైన్యం.

**- చామకూర బాగారెడ్డి,**
**మాజీ హవల్దార్, బోర్గాం**

### పాకిస్థాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలి



నాకు చిన్నప్పటి నుంచి దేశం అంటే అమితమైన ప్రేమ. ఎస్సెస్సీ పూర్తి కాగానే 17 ఏండ్ల వయస్సులోనే ఇండియన్ ఆర్మీకి సెలక్ట్ అయ్యాను. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌లో 2001 శిక్షణ పూర్తిచేసుకున్నాను. 2001 డిసెంబర్ 13న ఉగ్రవాదులు మన భారత పార్లమెంట్‌లో చొరబడి కాల్పులు జరిపారు. అప్పటి ప్రభుత్వం ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పాలని ఆపరేషన్ పరాక్రం చేపట్టింది. అప్పుడు మా అందరికి పాకిస్థాన్ బార్డర్‌లో రిపోర్టు చేయాలని ఆదేశాలు అందాయి. మొదటి పోస్టింగ్‌లోనే పాకిస్థాన్‌తో యుద్ధంలో పాల్గొనే అవకాశం వచ్చినందుకు చాలా సంతోషం కలిగింది. ఏడాది కాలం పాకిస్థాన్ బార్డర్‌లో ఆపరేషన్ పరాక్రంలో పాల్గొన్నందుకు చాలా గర్వంగా అనిపించింది. 2005లో జమ్ముకశ్మీర్‌లోని కిస్తువాడ్ సెక్టార్‌లో కౌంటర్ ఇంటెలిజెన్సీ ఆపరేషన్‌లో రెండేండ్లు పాల్గొన్న. ఆపరేషన్‌లో ఉగ్రవాదులను వేటాడాం. 2009లో చైనా బార్డర్ లే లాడాక్, సియాచిన్ గ్లెషియర్‌లో మంచుకొండల్లో రెండేండ్లు విధులు నిర్వహించాను. ఇప్పుడు కూడా మాలాంటి మాజీ సైనికులకు మళ్లీ యుద్ధానికి రమ్మని పిలుపు వస్తే వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాను.

**- బాలకృష్ణ, మాజీ హవల్దార్, గన్నర్,**
**భవానీపేట్, బోధన్ మండలం**

### టూరిస్టులపై కాల్పులు..దారుణం



జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. 26 మంది ప్రాణాలను పొట్టన బెట్టుకున్న ఉగ్రవాదులను విడిచిపెట్టేదిలేదు. మతం తెలుసుకొని చంపడమనేది చాలా ఘోరం. పాకిస్థాన్‌కు మన సైన్యం దీటైనా జవాబు ఇస్తున్నది. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్నది. డైరెక్ట్‌గా యుద్ధం ఎదుర్కొనలేక పిరికిపందలా ఉగ్రవాదులను పంపి టూరిస్టులపై కాల్పులు జరిపించింది. మన సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం సంతోషం.

**- కొండూర్ వసంత్‌రావు,**
**మాజీ హవల్దార్, పాల్దా జన్నేపల్లి, నవీపేట్ మండలం**

### ఎలాంటి పరిస్థితినైనా మన ఆర్మీ ఎదుర్కొంటుంది



కోటగిరి, మే 11: 1994లో ఆర్మీలో సైనికుడి(సోల్జర్)గా ఉద్యోగంలో చేరిన. 17 ఏండ్లు విధులు నిర్వహించి హవల్దార్ హోదాలో 2011లో ఉద్యోగ విరమణ పొందాను. 24 గంటలు అప్రమత్తంగా ఉండేవాళ్లం. 1999 కార్గిల్ వార్‌లో పాల్గొన్న. నెల రోజుల పాటు యుద్ధం జరిగింది. దేశ రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్క చేయలేదు. పార్లమెంట్‌పై దాడితోపాటు జమ్ముకశ్మీర్‌లో జరిగిన ప్రతి యుద్ధంలో పాల్గొన్న. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా భారత సైన్యం సమర్థవంతంగా ఎదుర్కొంటుంది. యుద్ధంలో పాల్గొనాలని నాకు పిలుపువస్తే వెళ్లడానికి నేను సిద్ధంగా ఉన్నాను.

**- నాగ్‌నాథ్,**
**రిటైర్డ్ ఆర్మీ జవాన్, కోటగిరి**





తల్లికి పాదాభివందనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

## హ్యాపీ మదర్స్ డే

బిచ్కుంద(జుక్కల్), మే 11: ఉమ్మడి జిల్లాలో ఆదివారం మాతృదినోత్సవం నిర్వహించారు. ఇందులోభాగంగా జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే తన మాతృమూర్తి పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. సృష్టిలో స్వచ్ఛమైన ప్రేమను పంచేది అమ్మ మాత్రమే అని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. మాతృ మూర్తులందరికీ మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## ఎప్‌సెట్‌లో కాకతీయ ప్రభంజనం



అనాస్ అలీ 1766 ర్యాంక్ | ఎం. సంకీర్త్ 2398 ర్యాంక్ | జి.వేదాక్షర్ 2881 ర్యాంక్ | ఎం. భవ్యశ్రీ 3310 ర్యాంక్ | ఎం. లోకేశ్ 3671 ర్యాంక్

ఖలీల్‌వాడి, మే 11: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాకతీయ విద్యార్థులు ఆదివారం విడుదలైన ఎప్‌సెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. తొలి ప్రయత్నంలోనే అద్భుత ప్రతిభ చూపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించి తల్లిదండ్రులతోపాటు కళాశాలకు వన్నె తెచ్చారని కాకతీయ విద్యాసంస్థల చైర్‌పర్సన్ సీహెచ్ విజయలక్ష్మి అభినందించారు. విద్యార్థులు అన్సా అలీ 1766 ర్యాంక్, సంకీత్ 2398, వేదక్సర్ 2881, భవ్య శ్రీ 3310, లోకేశ్ 3671, వైష్ణవి 4172, రిషిక్ 5932, నికేతన్ 5293వ ర్యాంక్ సాధించారు. విద్యార్థుల అభినందన సభలో ప్రిన్సిపాల్ సందీప్, రణదీశ్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ శ్యాం, సిబ్బంది పాల్గొన్నారు.

వర్ని మండలం శ్రీనగర్ రహదారిపై విరిగిపడిన చెట్లు




- పలు మండలాల్లో నేలకొరిగిన చెట్లు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- పలుచోట్ల ఎగిరిపోయిన ఇండ్ల పైకప్పులు

బోధన్, మే 11: బోధన్ డివిజన్‌లోని వర్ని, చందూర్,మోస్రా మండలాలలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. వర్ని మండలం శ్రీనగర్ పరిసర ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులకు భారీ వృక్షాలు నేలకొరిగాయి. అఘాందిఘారం శ్రీనగర్ శివారులో ఓ చెట్టు ప్రధాన రహదారిపై విరిగిపడింది. దీంతో సుమారు గంట పాటు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అధికార యంత్రంగం స్పందించి రహదారిపై పడిపోయిన చెట్లను తొలగించారు. పలు గ్రామాల్లో ఈదురు గాలులతో పాటు వర్షం కురిసింది. అక్కడక్కడ ఇండ్లపైకప్పు రేకులు ఎగిరిపోయాయి.

# గాలి, వాన బీభత్సం

చందూర్ మండల కేంద్రంలో ఈదురుగాలులతో కురుస్తున్న వర్షం



## వీడీసీల దౌర్జన్యాలపై న్యాయపోరాటం



మాట్లాడుతున్న ఐఎల్‌పీఏ బృందం సభ్యుడు

జక్రాన్‌పల్లి, మే 11: జిల్లాలో వీడీసీలు చేస్తున్న దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, బాధితులకు అండగా ఉంటూ న్యాయ పోటారం చేస్తున్నట్లు ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(ఐఎల్‌పీఏ) బృందం సభ్యులు పొన్నం దేవరాజ్‌గౌడ్, శాంసన్, వీఎం కృష్ణారెడ్డి, నరేందర్, అనంత ఆంజనేయులుగౌడ్, రాజారాం, సుమలత, సురేశ్, వెంకటేశ్ ప్రసాద్ అన్నారు. జక్రాన్‌పల్లి మండల కేంద్రంతోపాటు ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామాల్లో వీడీసీల దౌర్జన్యాలపై నిజ నిర్ధారణ చేసినట్లు తెలిపారు. జక్రాన్‌పల్లిలో భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బట్టు శ్రీధర్, బీఎంఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్, రక్షక్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన నిజ నిర్ధారణ కమిటీ సమావేశంలో పాల్గొని బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వీడీసీలకు వ్యతిరేకంగా, బాధితులకు అండగా నిలుస్తామని ఐఎల్‌పీఏ రాష్ట్ర అధ్యక్షుడు అడ్వకేట్ పొన్నం దేవరాజ్‌గౌడ్ అన్నారు. దౌర్జన్యాలకు పాల్పడుతున్న వీడీసీలపై కోర్టుల్లో కేసులు దాఖలు చేసి న్యాయ పోరాటం చేస్తామని అన్నారు. చాకలి, ఎస్సీ కులస్తులు వీడీసీల దౌర్జన్యాలను కమిటీకి వివరించారు. వీడీసీ నుంచి ఏడాది నుంచి వేధింపులు ఎక్కువయ్యాయని అన్నారు. ఆరు నెలల క్రితం నిర్మించుకున్న కమ్యూనిటీ హాల్‌ను కూల్చివేశారని తెలిపారు. రూ.10 లక్షల జరిమానా కట్టాలని ఆదేశాలు జారీ చేశారని, పదేండ్ల నుంచి దుకాణాల్లో సరుకులు కొనుగోలు చేయనివ్వడం లేదని, కూలీ పనికి పిలవడం లేదని, శుభ, అశుభ కార్యాలకు హాజరు కాకుండా గ్రామ బహిష్కరణ చేశారని వాపోయారు. న్యాయవాది జగడం రాజశేఖర్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు గూపన్‌పల్లి శంకర్, జగడం సురేశ్, నడ్కుడ శ్యామల, నడ్కుడ పద్మ, జగడం లక్ష్మి, దుబ్బాక చిన్నుబాయి, జగడం మోహన్, భూషణ్, శ్రావణ్‌కుమార్, అర్జున్, సదాశివుడు, వెంకటేశ్, తిరుమలేశ్, నవీన్, భాస్కర్, పవన్, తరుణ్, అబ్బన్న, స్రవంతి, లింగం పాల్గొన్నారు.